సాక్షి
శ్రీకాకుళం

మంగళవారం ; 26 ; ఆగస్టు ; 2025



వనామీకి వరుణ గండం

వనామీ రొయ్యకు వరుణ గండం పట్టుకుంది. చెరువుల్లో వర్షపు నీరు చేరుతోంది.

- 8లో



10 మంది అరెస్టు

పది మంది గంజాయి నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. జేఆర్‌పురం సీఐ అవతారం వివరాలు తెలిపారు.

- 8లో

ధర్నా వాయిదా

శ్రీకాకుళం: జిల్లా సర్వ శిక్షా కార్యాలయం ఎదుట మంగళవారం జరుప తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని దళిత జేఏసీ పక్షాన వాయిదా వేస్తున్నట్లు దళిత సంఘాల నాయకులు తెలిపారు. ఆదివారం రాత్రి సమావేశమైన సంఘ నాయకులు, సోమ వారం మరోసారి సమావేశమై వాయిదా నిర్ణయా న్ని తీసుకున్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య కుటుంబ సభ్యులు సమస్య పరిష్కారం కోసం కలెక్టర్‌తో సంప్రదింపులు జరుపుతున్నందున ధర్నా కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాలని నిర్ణయించారు.

న్యూస్‌రీల్

టీడీపీ సానుభూతిపరులకే ఎరువులు




రాత్రి సమయంలో పీఏసీఎస్ చైర్మన్ బంధువుల ఇంటి వద్ద ఎరువుల పంపిణీ

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురంలో టీడీపీ సానుభూతిపరులకే ఎరువులు వెళ్తున్నాయి. ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీకి సంబంధించి 110 టన్నుల ఎరువులు ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా ఆయా గ్రామాలకు 70 టన్నులు, పీఏసీఎస్ ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని బెల్లుపడ, రత్తకన్న రైతులకు 40 టన్నుల ఎరువులు సరఫరా చేయాల్సి ఉంది. కానీ స్థానిక పీఏసీఎస్ చైర్మన్ తన అధికార దర్పాన్ని ప్రదర్శించి తన సొంత ట్రాక్టర్ ద్వారా 60 యూరియా బస్తాలు, 30 డీఏపీ బస్తాలను తన స్వగ్రామం శాసనాంలోని తన బంధువుల ఇంటికి తరలించి తనకు అనుకూలమైన వ్యక్తులకు ఆదివారం రాత్రి సమయంలో తన సమక్షంలోనే ఎరువులు పంపిణీ చేయడం వివాదానికి దారితీసింది. సోమవారం ఎంపీపీ బోర పుష్ప అధికారులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బట్టబయలైంది. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి పీపీవీ అజయ్‌కుమార్‌ను వివరణ కోరగా పీఏసీఎస్ సొసైటీ ద్వారా ఎలాంటి కూపన్లు లేకుండా పీఏసీఎస్ చైర్మన్‌కు ఎరువులు ఇవ్వడంపై సంబంధిత సీఈఓకు నోటీస్ ద్వారా వివరణ కోరినట్లు తెలిపారు. సీఈఓ భుజంగరావును వివరణ కోరగా సొసైటీ చైర్మన్ తన ట్రాక్టర్ ద్వారా ఎరువులు తీసుకువెళ్లడం వాస్తవమేనని, అయితే ఆయన పీఏసీఎస్ చైర్మన్ కావడంతో కాదనలేకపోయానని అన్నారు.

28 నుంచి డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

శ్రీకాకుళం: జిల్లాలో డీఎస్సీ నుంచి పలు కేటగిరీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 28 నుంచి జరుగుతుందని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని సబ్జెక్టుల జాబితాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని చెప్పారు. అభ్యర్థులు తమ లాగిన్ ఐడీ ద్వారా మంగళవారం మధ్యాహ్నం నుంచి కాల్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. పత్రాల పరిశీలనకు వచ్చినప్పుడు అభ్యర్థులు విద్యార్హతల ఒరిజినల్ ధ్రువపత్రాలు ఇటీవల జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం, అంగవైకల్య ధ్రువీకరణ పత్రం, కాల్ లెటర్లో సూచించిన ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని చెప్పారు. అలాగే గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలను, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలను కూడా తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీ సమయాల్లో తప్పకుండా పరిశీలనకు హాజరుకావాలని, లేకుంటే వారి అభ్యర్థిత్వం రద్దు చేస్తామని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావడానికి ముందు ఆయా పత్రాలను వెబ్‌సైట్‌లో వ్యక్తిగత లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రతిమ..ప్రతిభ



విద్యార్థులు తయారు చేసిన మట్టి వినాయక ప్రతిమలు

సారవకోట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలు తయారు చేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు జి.ఉమాదేవి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసి పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలే వాడాలని పిలుపునిచ్చారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కక్షిదారులు అందరూ వారి కేసులను అవకాశం ఉన్నంత మేరకు రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని, సెప్టెంబర్ 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. కక్షిదారులతో న్యాయవాదులు మాట్లాడాలని లోక్ అదాలత్‌లో పరిష్కారంపై అవగాహన కల్పించాలని తెలిపారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటారు యాక్సిడెంట్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లోనూ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు.





2014-19 (చంద్రబాబు హయాంలో)

ఈ ఫొటో చూడండి. 2014–19లో టీడీపీ హయాంలో విత్తనాల కోసం జి.సిగడాంలో రైతులు క్యూలో నిలబడ్డ పరిస్థితి. కిలోమీటర్ల మేర విత్తనాల కోసం పడిగాపులు పడ్డ దృశ్యమిది. గంటల తరబడి బారులు తీరి నిలబడ్డా విత్తనాలు దొరకని పరిస్థితి.

2014–19లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో టెక్కలిలో ఎరువుల కోసం మండుటెండలో రైతులు నిలబడ్డ దుస్థితి. గంటల తరబడి నిలబడ్డా ఎరువులు దొరికేవా అంటే అదీ లేదు. బ్లాక్‌లో తరలిపోయిన ఎరువుల కారణంగా రైతులకు అందని పరిస్థితి.





2019-24 (వైఎస్ జగన్ హయాంలో)

వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతులకు అందించిన గొప్ప సేవలకు నిలువెత్తు సాక్ష్యమిది. జి.సిగడాంలో ఇంటి వద్దకే విత్తనాలు అందజేస్తున్న పరిస్థితి. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ముందే ఇండెంట్ తీసుకుని నేరుగా రైతుల ఇంటికే విత్తనాలు సరఫరా చేసిన దృశ్యమిది.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో వీరఘట్టంలో రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి విత్తనాలు, ఎరువుల ఎంత కావాలో తెలుసుకుని ఇండెంట్ తయారు చేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్.


అచ్చెన్న ఏలుబడి కష్టాల సాగుబడి

ప్రస్తుతం..

తాజాగా సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గం టెక్కలిలో యూరియా కోసం వర్షంలో బారులు తీరిన రైతుల దృశ్యమిది. అలాగని, ఇదేమీ రైతు భరోసా కేంద్రాల వద్దో, పీఏసీఎస్‌ల వద్దో కాదు. ప్రైవేటు ఎరువుల షాపుల వద్ద రైతుల అవస్థల చిత్రమిది.



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:



- వ్యవసాయ మంత్రి సొంత జిల్లాలో రైతులను వదలని సాగు కష్టాలు
- ఎరువుల కోసం అన్నదాతల పాట్లు
- ప్రైవేటు దుకాణాల వద్ద తప్పని క్యూలు
- 1999–2004, 2014–19 పరిస్థితులు పునరావృతం
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతుల ఇంటి వద్దకే విత్తనాలు, ఎరువులు

రైతులకు మళ్లీ చీకటి రోజులు గుర్తుకు వస్తున్నాయి. 1999–2004, 2014–2019 నాటి గడ్డు పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విత్తనాల దగ్గరి నుంచి ఎరువుల సరఫరా, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులు తీవ్రంగా అవస్థలు పడేవారు. వైఎస్ జగన్ వచ్చాక రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, వలంటీర్ల సాయంతో అన్ని సేవలను సులువుగా అందేలా చేశారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వంలో రైతులు నడిరోడ్డుపై నిలబడాల్సిన దుస్థితి ఎదురవుతోంది. ఒకప్పుడు విత్తనాలు, ఎరువులు టీడీపీ నాయకుల దయాదాక్షిణ్యాల మీదే అందేవి. సరిగ్గా అవే పరిస్థితులు మళ్లీ ఇప్పుడు కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గరి నుంచి విత్తనాలు, ఎరువుల కోసం రైతులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వచ్చిన విత్తనాలు, ఎరువులు ఏమైపోతున్నాయో తెలియడం లేదు. ఒక్క విత్తనాలు, ఎరువులే కాదు. ధాన్యం కొనుగోళ్లు కూడా గతేడాది అదే రకంగా జరిగాయి. రికార్డుల్లో గరిష్ట స్థాయిలో కొనుగోలు చేసినట్టు లెక్కలు చూపించారు. మిల్లులకు ట్యాగ్ చేసినట్టు పేర్కొన్నారు. కానీ రైతులు పండించిన ధాన్యం ఎక్కడికక్కడే ఉన్నాయి. మడుల్లోను, పొలాల్లోను ధాన్యం దిబ్బలు కనిపించాయి. ఆ తర్వాత తప్పని పరిస్థితుల్లో దళారులకు విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో..

2019–24లో రైతులకు స్వర్ణయుగమే అని చెప్పాలి. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రతీది రైతు ఇంటి వద్దకే వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు ఎంత సాగు చేస్తున్నారో? వారికెంత ఎరువులు అవసరమో? ఈ క్రాప్ ద్వారా ముందే గుర్తించేవారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి వివరాలు తీసుకునేవారు. ఆ మేరకు రైతులకు సరిపడా ఎరువులు నేరుగా ఇంటికే పంపిణీ చేసేవారు. ఎరువుల కోసం ఎవరినీ అడగాల్సిన అవసరం ఉండేది కాదు.

ఇప్పుడంతా రాజకీయమే..

ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వం ద్వారా అందించే ఎరువులపై నాయకులు పెత్తనం చెలాయిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద దించాల్సిన ఎరువులను తమ ఇళ్ల వద్ద, తమకు చెందిన ప్రైవేటు గోడౌన్ల వద్ద దించుకుంటున్నారు. కొన్ని చోట్ల తమ కనుసన్నల్లో నడిచే పీఏసీఎస్‌ల వద్ద దించుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో దించిన ఎరువులను సైతం తమ గుప్పెట్లో పెట్టుకుంటున్నారు. కావాల్సిన వారికి మాత్రమే ఇస్తున్నారు. దీంతో సాధారణ రైతులకు ఎరువులు అందడం లేదు. ప్రభుత్వం ఎంతకీ ఇవ్వకపోవడంతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అధిక ధరకు కొనుగోలుకు సైతం క్యూల్లో ఎండావానల్లో నిరీక్షిస్తున్నారు.

దారుణ పరిస్థితి

వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత జిల్లా, నియోజకవర్గంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. మొన్నటి వరకు విత్తనాలు దొరక్క అవస్థలు పడ్డారు. ఇప్పుడు ఎరువుల కోసం నానా పాట్లు పడుతున్నారు. ప్రైవేటు దుకాణాల వద్ద కూడా రైతులు ఎరువుల కోసం వానలో తడుస్తూ క్యూలో ఉంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ధాన్యం కొనుగోళ్ల మాదిరిగానే ఎరువుల విషయంలో కూడా స్కామ్ జరిగినట్టుగా స్పష్టమవుతోంది. జిల్లాకొచ్చిన ఎరువులు పక్కదారి పట్టి, టీడీపీ నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయాయన్న ఆరోపణలు ఉన్నాయి.

గత ప్రభుత్వంలో రైతులకు బాగుండేది



గత ప్రభుత్వంలో మా ఊరిలోకి యూరియాను తెచ్చి ఇచ్చేవారు. ఇంకా ఏమైనా మాకు అవసరమైతే టౌన్‌కి వచ్చి సులభంగా యూరియా తీసుకువెళ్లేవాళ్లం. ఇప్పుడు యూరియా కోసం పడుతున్న బాధలు చూస్తే కన్నీళ్లు వస్తున్నాయి.

డి.సూర్యం, రైతు, టెక్కలి మండలం

గతంలో మా ఊరికే యూరియా వచ్చేది..



వైఎస్సార్‌సీపీ పాలనలో మా ఊరిలోకి యూరియా వచ్చేది. ఇప్పుడు నందిగాం మండలం నుంచి టెక్కలి వచ్చి యూరియా కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇంతకంటే కష్టాలు రైతులకు ఇంకేం ఉంటాయి.

– కె.లక్ష్మి, రైతు, కామధేనువు, నందిగాం మండలం

యూరియా లేదంటున్నారు



యూరియా కోసం రైతులను ఉసూరుమనిపించడం మంచిది కాదు. తెల్లారి నుంచి కాపలా కాస్తే చివరకు యూరియా లేదని చెబుతున్నారు.

– కె.సరస్వతి, రైతు, నందిగాం మండలం

● నో స్టాక్



యూరియా కోసం నరసన్నపేటలో ఒక షాపు వద్ద క్యూ కట్టిన రైతులు

నరసన్నపేట: యూరియా కోసం రైతులు అల్లాడుతున్నారు. స్థానిక సుగుణా ట్రేడర్స్‌కు 200 బస్తాల యూరియా శనివారం వచ్చింది. ఆదివారం రోజు సెలవు ఇవ్వడంతో సోమవారం పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ జరిగింది. మండలంలో మొత్తం 20 షాపులు ఉన్నాయి. 20 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఒక్క చోట కూడా యూరియా స్టాక్ లేదు. ఈ పరిస్థితి గడిచిన పదేళ్లలో ఎప్పుడూ చూడలేదని రైతులంటున్నారు.

● నిలబడాల్సిందేనా..?



బూర్జ గ్రామ రైతుసేవా కేంద్రం ఆవరణలో టోకెన్‌ల కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

బూర్జ: ఎరువుల కోసం వర్షాన్ని కూడా లెక్క చేయకుండా బూర్జ రైతుసేవా కేంద్రం ఆవరణలో రైతన్నలు క్యూలో పడిగాపులు కాశారు. ప్రైవేటు దుకాణానికి వచ్చిన ఎరువుల కోసం టోకెన్లు ఇవ్వడంతో బూర్జ రైతు సేవా కేంద్రం ఆవరణలో రైతులు ఇలా బారులు తీశారు. అనంతరం ప్రైవేటు ఎరువుల షాపులో ఎరువులు అందజేశారు.



చవితి పండగ.. ప్రకృతికి అండగా

- మట్టి వినాయకులనే పూజిద్దాం
- స్థానిక వనరులతో పూజలు
- ఉత్సవ కమిటీలకు సూచనలు

శ్రీకాకుళం కల్చరల్: చవితి సంబరానికి అంతా సిద్ధమైంది. కాసిన్ని జాగ్రత్తలు తీసుకోగలిగితే పండగ చూసి ప్రకృతి కూడా నిండు గుండెతో నవ్వుతుంది. మట్టి విగ్రహాలను పూజించడం, ప్లాస్టిక్‌ను వినియోగించకపోవడం, స్థానికంగా దొరికే వస్తువులను వాడడం వంటి సాధారణ జాగ్రత్తలు తీసుకుంటే చవితి మరింత ప్రత్యేకమవుతుంది.

స్థానిక వనరులే మేలు..

గణపతిని పూజించేందుకు ఎన్నో వస్తువులు అవసరమవుతాయి. ఆన్‌లైన్ అనకుండా ఊరిలో వ్యాపారుల వద్ద కొంటే వారికి ఉపాధి దొరుకుతుంది.

మట్టే ముద్దు



చవితి పూజకు మట్టి వినాయకుడిని మించిన విగ్రహం లేదు. మన స్థానిక కళాకారులు ఎంతో ఆకర్షణీయంగా విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇళ్లలో పెట్టుకునేందుకైనా వీరి వద్దే కొంటే పర్యావరణానికే కాదు వారికీ మేలు జరుగుతుంది.

సింథటిక్ శాలువాలు వద్దు



కమిటీ సభ్యులు కొందరిని సత్కరించడం ఆనవాయితీగా వస్తోంది. ఆ సమయంలో సింథటిక్ శాలువాలతో కాకుండా నేత వస్త్రాలతో సత్కరిస్తే మన నేతన్నలకు ఉపాధి దొరుకుతుంది. విగ్రహానికి వేసే కండువాలను కూడా ఖాదీది వాడితే మేలు.

పాలథిన్ వద్దు..



పూజా సామగ్రిలో వీలైనంత వరకు పాలిథిన్ వస్తువులు వినియోగించకపోవడం మేలు. పాల ప్యాకెట్లు కాకుండా స్థానికంగా దొరికే పాలు వాడుకుంటే ఇంకా మంచిది.

డీజేలు కావాలా..?



వినాయక నిమజ్జనాల్లో డీజేల శబ్దాలు ఉండకపోతేనే మేలు. డీజేలు వాడడం వల్ల సౌండ్ పొల్యూషన్ ఏర్పడి మనుషుల చెవులు, గుండెలకు ఇబ్బందులు వస్తాయి.

మనందరి బాధ్యత



పర్యావరణానికి హాని లేకుండా పండగ నిర్వహించుకోవాలి. అందుకే మట్టి విగ్రహాలనే వాడాలని సూచిస్తున్నాం. అందరికీ అవగాహన కూడా కల్పిస్తున్నాం.

– కె.శోభారాణి, శ్రీకాకుళం

జలవనరులను పరిరక్షిద్దాం..



మట్టి విగ్రహాలు నీటిలో నిమజ్జనం చేస్తే నీటికి హాని ఉండదు. మా సంస్థ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌ను వ్యతిరేకిస్తోంది. దాని బదులు అందరూ మట్టి విగ్రహాలను వాడాలని, నదిలో నిమజ్జనం చేయాలని కోరుతున్నాం.

– కొమ్ము రమణమూర్తి, డైరెక్టర్, స్వీప్ స్వచ్ఛంద సంస్థ

మట్టి గణపతులనే పూజిద్దాం



వినాయక చవితి ఉత్సవాల సమయంలో కేవలం మట్టి వినాయక మూర్తులను మాత్రమే పూజిద్దాం. పర్యావరణాన్ని కాపాడుదాం. అతిథులను ఖాదీ కండువాలతో సత్కరిస్తే బాగుంటుంది. –పొన్నాడ రవికుమార్, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్, (పర్యావరణం)

ఆహారం వృథా చేస్తున్నారా..?

రోజూ తయారు చేసే ప్రసాదం ఒక వేళ మిగిలిపోతే వృథా చేయవద్దు. పేదలకు అందేలా చూడాలి.

తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలి

- దివ్యాంగులను ఆదుకోవడం మానవత్వం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ధర్మాన కృష్ణదాస్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రంలోని దివ్యాంగులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదల పెన్షన్లను తొలగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని, ఇప్పటికే కొంతమంది పింఛన్లు తొలగించారని, మరికొందరికి నోటీసులు అందజేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఈ మేర కు వినతి పత్రం అందజేశారు. ఆయనతో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, పార్టీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షుడు వెలమల బాలరాజు, పార్టీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు రౌతు శంకరరావు, కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణ, ఎంపీపీ రోణంకి ఉమ మల్లయ్య, మండల సంపతి రావు హేమ సుందర రాజు, వైస్ ఎంపీపీ దుక్క రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో నాలుగు వేల మంది దివ్యాంగులకు పింఛన్లు దూరం చేశారని తెలిపారు. 50 ఏళ్లకే పింఛన్ హామీని సైతం మర్చిపోయారని గుర్తు చేశారు. ఇప్పటివరకు ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయలేదన్నారు. రీ వెరిఫికేషన్, రీ అసెస్‌మెంట్ పేరుతో దివ్యాంగులను కష్టపెట్టడం మానవత్వం కాదని, వారిని ఆదుకోవాలని కోరారు. పింఛన్ల భారం తగ్గించుకోవడానికే ప్రభుత్వం ఇన్ని కుట్రలు పన్నుతోందని తెలిపారు. తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలన్నారు. పదేళ్లుగా పింఛన్ పొందుతున్న వారి ఆధారాన్ని దూరం చేయడం దారుణమన్నారు. దివ్యాంగులకు ఇలా అపకారం చేయడం వల్ల మనస్తాపానికి గురై బలవన్మరణాలకు పాల్పడుతున్నారని పేరాడ తిలక్ అన్నారు. రాజకీయాలు, పింఛన్లు వేర్వేరు విషయాలని, అలా ఆలోచించగలిగేది వైఎస్ జగన్ మాత్రమేనని తెలిపారు.



శ్రీకాకుళంలో వానలో ప్రయాణిస్తున్న వాహనదారులు

● జిల్లాలో జడివాన

జిల్లా వ్యాప్తంగా సోమవారం వానలు కురిశాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తున్నాయి. ఎక్కువగా మందసలో 36 మిల్లీమీటర్లు, నందిగాంలో 27 మిల్లీమీటర్లు, మెళియాపుట్టిలో 19 మిల్లీమీటర్లు, ఎల్ఎన్ పేట, హిరమండలంలలో 15.5 మిల్లీమీటర్లు, నరసన్నపేటలో 11 మిల్లీమీటర్ల వాన కురిసింది. మిగిలిన చోట్ల చెదురుమదురు జల్లులు కురిశాయి. మంగళవారం కూడా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

– శ్రీకాకుళం పాతబస్టాండ్



అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- పీజీఆర్ఎస్‌లో 102 అర్జీలు స్వీకరణ


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదైన అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో ఆయన అర్జీలు స్వీకరించారు. విభిన్న ప్రతిభావంతుల వద్దకు కలెక్టర్ స్వయంగా వెళ్లి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. స్వీకరించిన అర్జీల్లో రెవెన్యూ 9, గ్రామీణాభివద్ధి శాఖ 3, పంచాయతీ రాజ్ 5, వ్యవసాయ శాఖ 5, ఏపీఈపీడీసీఎల్ 4, సర్వే అండ్ లాండ్ రికార్డులు 3, మున్సిపల్ కార్పొరేషన్ – 1, జిల్లా పంచాయతీ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ 3, జిల్లా విద్యాశాఖ 2, ఆర్అండ్‌బీ – 1, హోం – 1, సమగ్ర శిక్ష – 1, మెడికల్ ఎడ్యుకేషన్ – 1 తదితర 102 వినతులు ఉన్నాయి. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజ తదితరులు ఉన్నారు.

- పాతపట్నం మండలం పెద్ద లోగిడి గ్రామానికి చెందిన దువ్వారి మీనా కుమారి తమ ఇంట్లో ఈ ఏడాది మే 6వ తేదీన సుమారు 8 తులాల బంగారం చోరీకి గురైందని తెలిపారు. దీనిపై పాతపట్నం పోలీసుస్టేషన్‌కి ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసింది. తన బంగారం రికవరీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరింది.

యోగాసన పోటీల్లో మెరిసిన శ్రీకాంత్


పతకం అందుకుంటున్న శ్రీకాంత్ మహంతి

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన శ్రీకాంత్ మహంతి రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీల్లో రెండు బంగారు పతకాలతో మెరిశాడు. ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు తాడేపల్లిగూడెంలో జరిగిన 6వ రాష్ట్రస్థాయి యోగాసన చాంపియన్ షిప్ – 25 పోటీల్లో శ్రీకాంత్ మహంతి 28 నుంచి 35 ఏళ్ల విభాగంలో బంగారు పతాకాలు సాధించాడు. దీంతో ఆయనను కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లు అభినందించారు.

వాన జోరు.. నిరసనల హోరు

జిల్లా కేంద్రంలో సోమవారం విస్తారంగా వర్షం కురిసింది. అయితే ఒకవైపు వర్షం కురుస్తున్నా.. మరోవైపు జిల్లా పరిషత్ వద్ద పలువురు నిరసనలతో హోరెత్తించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. – శ్రీకాకుళం పాతబస్టాండ్

శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో ఉంచాలి


పీజీఆర్ఎస్ వద్ద నిరసన తెలుపుతున్న ఎల్ఎన్‌పేట వాసులు

పాతపట్నం నియోజకవర్గం పరిధిలో ఉన్న ఎల్ఎన్‌పేట మండలాన్ని శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో ఉంచాలని, పలాస జిల్లాకు పంపించవద్దని ఆ మండలంలోని పలు గ్రామాలకి చెందిన ప్రజలు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. ఎల్ఎన్‌పేట మండలం చాలాకాలం పాటు శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో ఉండేదని, రెవెన్యూ డివిజన్ల విభజనలో ఈ మండలం పాతపట్నం నియోజవకవర్గంతో పాటు టెక్కలి డివిజన్ మార్చారని గుర్తు చేశారు. దీనివలన టెక్కలికి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, అత్యంత సమీపంలో ఉండే శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లోనే ఉంచాలని విన్నవించారు. ఈ మేరకు పలు పంచాయతీలు తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు.


నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

పింఛన్లు తీసివేయడం అన్యాయం

దివ్యాంగత శాతం 40% కంటే తక్కువ చూపించి, తనిఖీలు పేరిట రీసర్వేలు చేసి, పింఛన్ల రద్దుకు నోటీసులు జారీ చేయడం అన్యాయమని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక అభిప్రాయపడింది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కోరుతూ జెడ్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దీనివలన జిల్లాలో సుమారుగా 4,000 మంది దివ్యాంగులు పింఛన్ కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కి వినతిపత్రం అందజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) సభ్యులు కోరారు. ఈ మేరకు జెడ్పీ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పి.పవిత్ర మాట్లాడుతూ విద్యార్థులకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వానికి విద్యారంగంపై చిన్నచూపు తగదన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు డి.చందు ఖగేష్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

వనామీకి.. వరుణ గండం..!


వనామీ రొయ్య


అంపలాం వద్ద వర్షపు నీటితో నిండిపోయిన రొయ్యల చెరువు

- చెరువుల్లో చేరుతున్న వర్షపు నీరు
- నీటిని తోడే క్రమంలో పోషకాలు కోల్పోతున్న వైనం
- అదనపు ఖర్చు అవుతోందని ఆక్వా రైతు ఆందోళన

పోలాకి: ఒకప్పుడు రొయ్యల సాగు చేసే ఆక్వా రైతు మీసం మెలేసే పరిస్థితుల నుంచి, ఏరోజుకు ఏరూపంలో కష్టనష్టాలు ఎదురొస్తాయోనని నిత్యం భయపడేస్థాయికి మారింది పరిస్థితి. ఇప్పుడు తాజాగా వర్షాకాలం కావడంతో న్యూట్రిషన్స్ కొరత రూపంలో కొత్తకష్టం వచ్చిపడింది. జిల్లాలో ఎక్కువగా ఉప్పునీటి వనామీ కల్చర్ సాగు చేస్తున్న రైతులు చెరువుల్లో నీటిని నిల్వచేసే సమయంలో 10 శాతం కనిష్ట స్థాయి నుంచి 30 శాతం గరిష్ట స్థాయి వరకు లవణ శాతాన్ని కొనసాగిస్తారు. అదే క్రమంలో రొయ్యల ఎదుగుదలకు అవసరమైన ప్రోటీన్లు, లిపిడ్లు, కార్బోహైడ్రేట్స్, విటమిన్లు, ఖనిజాలు మరియు ఇతర పోషకాలు సైతం ఉండేలా ఏర్పాటు చేసుకుంటారు.

అయితే ఇటీవల వర్షాలకు చెరువుల్లో వర్షపు నీరు చేరడంతో ఆ నీటిని బయటకు తోడాల్సి వస్తోంది. దీంతో సదరు లవణ శాతంతో పాటు పోషకాలు కూడా బయటకు పోతున్నాయి. ఫలితంగా రొయ్య ఎదుగుదలలో మేతతో సమానంగా అందాల్సిన పోషకాల కొరత ఏర్పడుతోంది. ఈ సమయంలో మళ్లీ ప్రొబయోటిక్స్ మొదలుకుని న్యూట్రిషన్స్ బ్యాలెన్స్ చేయడం కోసం వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ ఒడిదుడుకుల నేపథ్యంలో ధరలు సైతం పతనమైన పరిస్థితుల్లో మళ్లీ పోషకాల కోసం అదనపు ఖర్చులు పెట్టాలంటే తడిసిమోపుడవుతోందని వాపోతున్నారు.

సబ్సిడీపై పట్టించుకోని పాలకులు

ఆక్వా సాగులో కేవలం పోషకాల కోసం మొత్తం సాగు ఖర్చులో 20 శాతం కేటాయించాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలోనే పోషకాలు సబ్సిడీపై అందించాలని ఎప్పటినుంచో రొయ్యల రైతులు, సంబంధిత సంఘాలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ప్రధాన పోషకాలైన మెగ్నీషియం, కాల్షియం, సోడియం, పొటాషియం, క్లోరైడ్స్ వంటివి రాయితీపై అందిస్తే కొంత ఖర్చులు తగ్గే అవకాశం ఉంది. మార్కెట్‌లో ఎకరాకు అయ్యే పోషకాల విలువ దాదాపుగా రూ.2,500 వరకు ఉంది. పంటకాలంలో పరిస్థితులను బట్టి 10 నుంచి 12 సార్లు వాడాల్సి ఉండగా వర్షాకాలం అదనంగా మరో 5 దఫాలుగా వాడుతున్నారు. అయితే సదరు పోషకాలు సబ్సిడీపై అందించాలని ఎప్పటినుండో ఆక్వా రైతులు డిమాండ్ చేస్తున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదు. అందువలన ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పోషకాల ఖర్చును గుర్తించి ఆక్వా రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ధరలు పెరుగుతున్నాయి



రొయ్యల ధరల్లో అనేక కారణాలతో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ పోషకాల ధరలు మాత్రం ప్రతి ఏటా పెరుగుతున్నాయి. గతంతో పోల్చితే పోషకాల వినియోగం ఎక్కువైంది. వర్షాకాలంలో నీటిని బయటకు తోడితే పోషకాలు సైతం మళ్లీ అందించాల్సిన పరిస్థితులు ఏర్పడుతుంటాయి. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి ఆక్వా అభివృద్ధి కోసం పోషకాలు రాయితీపై అందిస్తే బాగుటుంది.
– పల్లి సింహాచలం, ఆక్వా రైతు, డీఎల్‌పురం

అవగాహన పెంచుకోవాలి



ఆక్వా రైతులు పోషకాల వినియోగంపై ఇంకా అవగాహన పెంచుకోవాల్సి ఉంది. కేవలం అవగాహనతోనే పోషకాల ఖర్చుల్లో నియంత్రణ వస్తుంది. రొయ్యలు లేదా చేపల పెంపకంలో నీరుకూడా దాగి ఉన్న పోషకంగా పరిగణించబడుతుంది. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో నీటిని బయటకు తోడాల్సి వచ్చినపుడు అదనపు పోషకాలు అందించక తప్పదు.
– డాక్టర్ హెచ్.డిల్లీశ్వరరావు, ఫిషరీస్ అసిస్టెంట్, గుప్పెడుపేట సచివాలయం

సబ్సిడీపై అందజేయాలి



ఒకప్పుడు విద్యుత్ లేదా డీజిల్ కోసం పెట్టే ఖర్చుతో చాలా ఇబ్బంది ఉండేది. ప్రభుత్వాలు కల్పించుకుని రాయితీ ఇవ్వడంతో ఆ ఖర్చులు బాగా తగ్గాయి. ఆదే క్రమంలో పోషకాలు, మేతలు, రొయ్య పిల్లలకు సైతం రాయితీలు దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తే ఆక్వా మరింత అభివృద్ధి దిశగా అడుగులు పడతాయి. దీంతో ఉపాధి అవకాశాలు సైతం మెరుగుపడే అవకాశం ఉంది.
– తిర్లంగి శ్రీనివాసరావు, ఆక్వా రైతు, పిన్నింటిపేట

సంక్షిప్తంగా..

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


రమేష్(ఫైల్)

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ వైశ్యవీధికి చెందిన మల్లా రమేష్(55) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు రమేష్ తన ఇంటి సమీపంలో చిన్న పిండి మిల్లు నడుపుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. అయితే జీవనాధారమైన పిండి మిల్లే తన పాలిట యమపాశంగా మారింది. సోమవారం సాయంత్రం గ్రామస్తులు తెచ్చిన పిండి మిల్లు ఆడించిన తర్వాత దానిని ఆపే ప్రయత్నంలో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య వాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, అనంతరం శవపంచనామ నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి


అన్నెపు వైకుంఠరావు (ఫైల్)

పాతపట్నం: పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అన్నెపు వైకుంఠరావు(52) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడని ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. సోమవారం ఉదయం పాతపట్నం శివానీనగర్‌లో ఇంట్లో నుంచి సబ్ జైల్ డ్యూటీకి బయలుదేరుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. స్వగ్రామం టెక్కలి మండలం బలరాంపురం. భార్య అన్నెపు నాగమణి, ఇద్దరు కుమార్తెలు తనుజా, హిందుజాలు ఉన్నారు. విషయం తెలియగానే పాతపట్నం సీఐ వి.రామారావు, ఎస్ఐ బి.లావణ్య, పీఎస్ సిబ్బంది ఇంటికి చేరుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు మృతి


మృతి చెందిన శాసుమాల మోహన్‌రావు

మందస: మండలంలోని వీజీపురం గ్రామానికి చెందిన శాసుమాల మోహన్ రావు(60) లారీ ఢీకొనడంతో సోమవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోహన్‌రావు తన కుమారుడు శాసుమాల నరసింహతో కలిసి పొలం పనులు చేసుకొని ద్విచక్ర వాహనంపై తమ ఇంటికి వస్తున్నారు. ఆ సమయంలో పలాస వైపు నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో బైకు నుంచి ఎగిరిపడ్డారు. ఈ క్రమంలో మోహన్‌రావు తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందారు. ఆయన కుమారుడికి సైతం గాయాలవ్వడంతో వైద్యం నిమిత్తం హరిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడ నుంచి శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

జి.సిగడాం: మండలంలోని గెద్ద కంచరాం గ్రామంలో యువకుడిపై స్నేహితుడు కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. గాయపడిన యువకుడు రాజశేఖర్‌ను స్థానికులు శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తీసుకెళ్లారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. మృతుడికి భార్య హరిప్రియ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజశేఖర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.


కత్తిపోట్లకు గురైన రాజశేఖర్

రోడ్డు ప్రమాదంలో యాచకురాలి మృతి

- ప్రమాదం చూసి తోటి యాచకుడు హఠాన్మరణం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మధుసూదనరావు


యాచకురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జి.సిగడాం: మండలంలోని వాండ్రంగి పంచాయతీ చీడిపేట గ్రామంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకురాలు బలగ భాగ్యం(50) అక్కడికక్కడే మృతి చెందింది. భాగ్యం మృతిని చూసి తోటి యాచకుడు కె.కోటి అక్కడే కుప్పకూలి మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భాగ్యం, కోటి ఇద్దరూ చీడిపేటలో కలిసి జీవనం సాగిస్తున్నారు. వీరు జీవనోపాధిగా యాచక వృత్తి చేస్తున్నారు. సోమవారం ఉదయం 4 గంటల సమయంలో భాగ్యం కాలకృత్యాలు తీర్చుకోవడానికి రోడ్డు పక్కకు వెళ్లి ఉంటారని తెలిపారు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై మృతి చెందింది. భాగ్యంకు ప్రమాదం జరగడం చూసిన తోటి యాచకుడు కోటి(60) నలబై అడుగుల దూరంలోనే కుప్పకూలి మృత్యువాతపడ్డాడు. సమాచారం తెలుసుకుని ఎస్ఐ వై.మధుసూదనరావు, శ్రీకాకుళం క్లూస్ టీమ్, స్థానిక సర్పంచ్ సాకేటి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి వడగా గౌరీశంకరావు, వీఆర్వో శివనారాయణ సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. భాగ్యం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

10 మంది గంజాయి నిందితులు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎం.అవతారం, ఎస్ఐ చిరంజీవిలు

రణస్థలం: గంజాయి క్రయ, విక్రయాలు జరుపుతున్న 10 మంది నిందితులను అరెస్టు చేసినట్లు జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. ఈ మేరకు జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రణస్థలం మండలంలోని పైడి భీమవరం భూమాత టౌన్‌షిప్ వద్ద 22.5 కేజీల గంజాయితో ఐదుగురు నిందితులను జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవితో పాటు సిబ్బంది ఈనెల 24న తొలుత పట్టుకోవడం జరిగిందని తెలియజేశారు. ఆ నలుగురి నిందితులకు గంజాయి అమ్మకాలు, కొనుగోలు జరిపిన, సహకరించిన మరో ఐదుగురు నిందితులను అదుపులోనికి తీసుకున్నామని చెప్పారు.

ఒడిశా నుంచి గంజాయి

ఈనెల 23వ తేదీన బగాన పవన్ కుమార్, ఇనాకోటి ముకుందాతో కలిసి దినేష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఒడిశాలోని కొరాపుట్ దగ్గర ఉన్న పొత్తంగి వెళ్లి గుంత శుక్ర అనే వ్యక్తి దగ్గర 22.5 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. అక్కడ నుంచి గుంత శుక్రకు స్నేహితులను పరిచయం చేస్తానని చెప్పి ముగ్గురు ద్విచక్ర వాహనంపై పైడి భీమవరం వచ్చారు. భూమాత టౌన్ షిప్ వద్ద గంజాయి సేవిస్తూ, తెచ్చిన 22.5 కేజీల 5 ప్యాకెట్లను విభజించి స్నేహితుల ద్వారా అమ్మకాలు జరిపేందుకు పన్నాగం పన్నారు. తుపాకుల అనిల్ కుమార్, లక్కవరపు పవన్ కుమారులు ఇందులో కొంత మొత్తం హైదరాబాద్‌లోని బాడాన సామిత్, బెంగళూరులోని మొదలవలస సందీప్‌కు అమ్మడానికి తీసుకుని ఉండగా జేఆర్‌పురం పోలీసులు పట్టుకున్నారు. బగాన పవన్ కుమార్‌పై గతంలో ఎచ్చెర్లలో గంజాయి కేసు నమోదై ఉంది. అరెస్టైనవారిలో బగాన పవన్ కుమార్, ఇనకోటి ముకంద, గుంత శుక్ర, తుపాకుల అనిల్ కుమార్, లక్కవరపుకోట పవన్ కుమార్, లంకపల్లి దినేష్, ఆళ్ల వెంకటరావు, సురవరపు వరప్రసాద్, బనిశెట్టి భాను వెంకటప్రతాప్, ముడిల మోహన్ వెంకట ప్రతాప్‌లు ఉన్నారు.

దంపతుల ఆత్మహత్యపై వివరాల సేకరణ

శ్రీకాకుళం: గార మండలం అంపోలులో అప్పారావు దంపతుల ఆత్మహత్య ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ఐద్వా బృందం సోమవారం అంపోలులో పర్యటించింది. మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆ దంపతుల కుమార్తెను కూడా పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగరాపు సింహాచలం మాట్లాడుతూ పెన్షన్ రద్దు ఆందోళనతో తీవ్ర మనస్తాపానికి గురై అప్పారావు దంపతులు బలవన్మరణానికి పాల్పడ్డారని తెలిపారు. ఒకవైపు ఆర్థిక ఇబ్బందులు, ఇంకోవైపు పెన్షన్ తొలగింపు భయం ఆయనను వెంటాడాయని వివరించారు. తల్లితండ్రులను కోల్పోయి అనాథగా మారిన బాలికకు ప్రభుత్వం స్పందించి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.సూర్యడమ్మ ఎం.లక్ష్మి, డి.లక్ష్మి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మంగమ్మ, జి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు ఎందుకు లేవు..?


టెక్కలిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

టెక్కలి: జిల్లా రైతులకు అవసరమైన ఎరువుల్లో యూరియాను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఎందుకు కేటాయించలేకపోయారని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యుడు ఎన్.షణ్ముఖరావు నిలదీశారు. సోమవారం టెక్కలిలో కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన యూరియా దొరక్కపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 42,200 మెట్రిక్ టన్నులకు పైగా యూరియా అవసరమైనప్పటికీ కేవలం 21,644 మెట్రిక్ టన్నుల యూరియాను మాత్రమే అందుబాటులో ఉంచారని విమర్శించారు. ఈ విషయంలో మంత్రి విఫలమయ్యారని పేర్కొన్నారు. అవసరమైన యూరియా అందజేయకపోతే ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని గోవిందరావు హెచ్చరించారు. సమావేశంలో హెచ్.ఈశ్వరరావు, బి.వాసుదేవరావు, పోలయ్య, బి.అప్పారావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.